ఆశలా తేజస్సుతో ఉదయించాడు సూర్యుడు. అతడిని కమ్మివేయటానికి మబ్బులు ఓ మూలన సమాలోచనలు జరుపుతున్నాయి.

శ్రీనివాసరావునీ, అతని కుటుంబ సభ్యులనీ ఆ ఉదయం ఆశ తట్టి నిద్రలేపి 'ఆనందం' బెడ్ కాఫీని యిచ్చింది. దాన్ని సేవించిన వాళ్ళముఖాలు సూర్యుడిలా వెలిగిపోతున్నాయి. అది ప్రసరించిన చురుకుదనానికి వాళ్ళ మనసుల్లో ఆలోచనలు కిరణాల్లా పరుగెడుతున్నాయి—

గోవింద్:


"ఈరోజెంత మంచిరోజు! గురుడు ఎక్కడో స్క్రాచ్ కొట్టుకొచ్చాట్ట ఆ మజాకి తోడు కొత్త బ్యూటి రోజా. ఓహ్! వాటే కాంబినేషన్! ఖర్చు కాస్త ఎక్కువే అయినా ... నాన్న నా ఫిక్షన్ తేలిగ్గానే నమ్మేశాడు. డబ్బు యివాళే యిచ్చేస్తానన్నాడు. అదృష్టం అంటే యిదీ! యిలా కలిసిరావాలి! ఈ రాత్రి ఆనందలోకాల అవధులు తాకి రావాలి."

శైలజ:

"డైమండ్ నోస్‌రింగ్ చేయించుకోడానికి నాన్న ఈ రోజే డబ్బిస్తానన్నాడు. ఇప్పటికే ఆలస్యమైందేమో! ఇవాళే ఆర్డరివ్వాలి. లేకపోతే నా ఫ్రెండ్స్ అడ్వాన్సయిపోతారు. అలా కానివ్వకూడదు. 'ఫ్యాషన్ క్వీన్' బిరుదు పోగొట్టుకో

# బోనులో పడ్డ ఎలుక

## ఆర్.కె. కటారి



## అల్పసంతోషి ఆంధ్రుడు

గోదావరి ఎక్స్‌ప్రెస్ గోదావరి స్టేషన్లో ఆగదు.
సింహాద్రి ఎక్స్‌ప్రెస్ సింహాచలం వెళ్లనే వెళ్లదు.
కోణార్క ఎక్స్‌ప్రెస్ అంటారా! కోణార్క అసలు దారిలోనే రాదు

గనక—

జాతీయ ఉత్తుత్తి పంచవర్ష పథకం క్రింద వచ్చే
చౌకధరల దుకాణాల్లో వస్తువులు చౌకగా దొరక్కపోయినా, అసలే దొరక్కపోయినా
మేం కనీసం ఊరుకుంటున్నాం!

—బరాగో

కూడదు. కాలేజిలో చదివినంతకాలం ఆ టైటిల్ నిలుపుకోవాలి."

మోహన్ :

"సెకెండ్‌క్లాసుకి రాగానే సైకిలు కొనిస్తానన్నాడు నాన్న. ఇంతవరకు కొనివ్వలేదు! ఇవాళ సగం డబ్బులిస్తానన్నాడు. నా దగ్గరే వుంచుకో మన్నాడు కూడ! మిగతాది వచ్చే నెల జీతం రాగానే యిస్తానన్నాడు. ఇంకొక్క పది రోజుల్లో హాయిగా సైకిలుమీద యెక్కడికైనా రైఁమని పోవచ్చు!"

సునీత :

"అమ్మ నాకు లాకెట్ చేయిస్తానంది. ఇంకా డబ్బులు కొరవైనాయట. అవి నాన్న ఈ రోజు యిస్తానన్నాడు. ఇక అమ్మ లాకెట్ చేయిస్తుంది ఎంచక్కా స్కూలుకి పెట్టుకుపోవచ్చు. గొప్ప-తనకే లాకెట్ వుందని సురేఖకి పెద్ద పోజు! నా లాకెట్ చూసి కుళ్ళుకుంటుంది! అంతే కావాలి!"

కమల :

"కమ్మలు మరీ పాతవైపోయాయి. బజార్లోకి కొత్త కొత్త ఫ్యాషన్లవి వస్తున్నాయి. వీటిని కరిగించి యింకాస్త బంగారం వట్టినా వెడల్పాటివి— కామేశ్వరి చేయించుకున్న వాటికన్నా మంచివి చేయించుకోవాలి. ఆవిడకన్నా వేనెందులో తీసిపోయాను? ఆయన యివాళే డబ్బులిస్తానన్నాడు. సాయంత్రం కోటాచారిని పిలిపించి ఒకేసారి నా కొత్త కమ్మలకి, శైలజ ముక్కుపుడకకి, సునీత లాకెట్‌కి ఆర్డరివ్వాలి."

శ్రీనివాసరావు :

"ఈ పార్టీ ఎవడోగాని డబ్బంటే లెక్కచేసే ఘటంలా లేదు. కూరగాయల బేరం చెయ్యకుండా, పని వెంటనే చేస్తే అడిగినంతా యిస్తానన్నాడు. ఇవ్వక చస్తాడా? పని యింత త్వరగా జరిగితే వాడికి బోలెడంత లాభం! పని రాత్రే పూర్తయిందికదా. ఇచ్చిన మాటప్రకారం అతనొచ్చేలోగా కాగితాలు రెడీగా వుంచాలి. వసగాళ్ళు ఎంత మందొస్తే ఏంలాభం! ఇలాంటి కేసులు పది తగిలితే పంట పండినట్టే!"

* * *


వస్తున్న మొత్తం తలుచుకొని శ్రీనివాసరావు మనసు సంతోషంతో తెప్పలా తేలిపోతున్నా, వచ్చిన డబ్బంతా యీ రోజు యింట్లోవాళ్ళ కోర్కెలు తీర్చటానికే సరిపోతుందేమోనన్న దిగులుతో అతని హృదయం బరువెక్కినైన బండిలా భారంగా మూలుగుతోంది. బండివానికి ఎడ్లమీద వచ్చినట్టుగా చిరాకు, కోపం కూడ పుట్టుకొచ్చాయి.

"వీళ్ళ కోర్కెలతో నా ప్రాణం తీస్తున్నారు. నా కోర్కె మాత్రం వెనకపడిపోతూంది. ఇదీ, ఇంకొక్క కేసుదీ కలిపితే నేననుకున్న ఫిక్సెడ్ డిపాజిట్లు పూర్తవుతాయి. ఆతర్వాత దేవుడు మేలుచేస్తే హౌస్ కన్‌స్ట్రక్షన్‌కి ప్లాన్ వెయ్యాలి.... కాని వీళ్ళ దర్జాలు చూస్తుంటే నలుగురు నోళ్ళలో నాచేతట్టున్నాను. చిన్నపిల్లలంటే-పోనీ చాలాకాలం నుంచి అడుగుతున్నారు-వాళ్ళ కోర్కెలు తీర్చడం సమంజసంకూడ. కాని మిగతా వాళ్ళదే మిడిమేళంగా వున్నది! శైలజకి ఫ్యాషన్ మోజు! ఎక్కడెక్కడి ఫ్యాషన్లూ తనకే కావాలి! వాడేమో ఎప్పుడూ ఫ్రెండ్స్, పిక్నిక్‌లంటాడు! ఇంటిపట్టున వుండడు. వీళ్ళు చదువులెలా వెలగబెడుతున్నారో! ప్రయోజకులవుతారో, నా పరువు తీస్తారో! వీళ్ళ చదువుల గురించి పట్టించుకోటానికి నాకేమో తీరికుండదు. నా యావతోనే నాకు సరిపోతోంది. అవునుమరి! దీపమున్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోమన్నారు. ఇదంతా కూడ వాళ్ళకోసమేగద!.... అసలు యింట్లో ఆడదాని కుండాలి యిటువంటి వాటిమీద శ్రద్ధ! మగవాడికి బయట సవాలక్షపనులు. తను సక్రమంగా ఆఘోరిస్తేకదా పిల్లల్ని అదుపులో పెట్టటానికి! సగం దీని అలుసే పిల్లలకి! సంపాదిస్తున్నాడని అంగరూ అనుకోకుండా గుట్టుగా కాపురం నడుపుకోవాలన్న జ్ఞానమే లేదు. చెప్పినా అర్థం కాదు! హోదాకి తగ్గట్టు వుండొద్దాఅంటుంది. దాని బొంద! దానికి రకానికొక నగవుంది. రవికుపైగా పట్టుచీర లున్నాయి. ఇంకా పట్టుచీరలమీద, నగలమీద భ్రాంతి పోలే! ఎప్పుడూ పాతనగలు చెడగొట్టించటం, కొత్తవి చేయించటం. సంపాదన లేకపోతే ఏం చేసేదో!...."

"నాన్నా మేం స్కూలుకు వెళ్తున్నాం!" అంటూ మోహన్, సునీత గదిలోకి రావటంతో శ్రీనివాసరావు ఆలోచనలు చెదిరిపోయాయి.

స్కూలుకు వెళ్తున్నట్టు చెప్పటానికొచ్చినా, వాళ్ళ రాకలోని అంతర్యం గ్రహించి నవ్వుకొని "నాకు గుర్తుంది లెండర్రా! సాయంత్రం ఆఫీసుమించి

చతురంబోధి వరీత భూవలయ....



రాగానే మీకు డబ్బులిస్తాను. వెళ్ళిరండి" అంటూ వాళ్ళతోపాటు హాలులోకొచ్చాడు.

అక్కడ గోవింద్, శైలజ కూడ పుస్తకాలు పట్టుకొని నిల్చొని వున్నారు. వాళ్ళని చూసికూడా నవ్వొచ్చి "మీ విషయమూ నాకు గుర్తుంది వెళ్ళిరండి" అన్నాడు.

కాని వాళ్ళు కదలలేదు.

"మధ్యాహ్నం కాలేజికి వెళ్ళినప్పుడే యివ్వాలి నాన్నా వాళ్ళకి డబ్బు" అన్నాడు. గోవింద్ అవసరమన్నట్టుగా.

"అవునాన్నా. సాయంత్రం మీ చెప్పు దొస్తారో నేను కాలేజినుంచి రాగానే గోల్డ్‌స్మిత్‌ని పిలిపించి ఆర్డరివ్వాలి. మరి గోల్డుకి ముందే డబ్బివ్వాలిగా?" అంది శైలజ కూడ.

"మరెలాగమ్మా? నే నొచ్చేది సాయంత్రమేకదా!" వాళ్ళ వుద్దేశమేమిటో అర్థంకాక అన్నాడు శ్రీనివాసరావు.

"మధ్యాహ్నమోసారి ఇంటికొచ్చి వెళ్ళండి" అంటూ వంట గదిలోంచి వచ్చింది కమల. భర్తకి దగ్గరగా వచ్చి అతని చెవిలో చెప్పింది. "ఉదయమే డబ్బు వస్తుందన్నారుగా. మీరొచ్చేదాకా అంత డబ్బు దగ్గరుంచుకోడం మంచిది కాదు!"

భార్య సలహా ఉచితంగానే తోచిందతనికి.

"సరే! ఎలాగో వీలుచూసుకొని మధ్యాహ్నం వస్తాలే. మీరు వెళ్ళండి టైమైంది" అని వాళ్ళని సాగనంపాడు.

వాళ్ళ ముఖాల్లో ఫ్లడ్‌లైట్స్ వెలిగి కాలేజికి కాళ్ళు సాగాయి.

* * *

మధ్యాహ్నం పిల్లలందరి భోజనాలయాయి. మోహన్, సునీత స్కూలుకెళ్ళారు. గోవింద్, శైలజ తండ్రి కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. ఒకపక్క కాలేజికి టైం అవుతున్నా శ్రీనివాసరావు ఇంకా రాలేదు.

విసుక్కుంది శైలజ. "ఏఁవిటీ! కాలేజి టైం తెలిసి కూడ నాన్న ఇంకా రాలేదు!" అని మరికొద్ది నిమిషాలు చూసి ఇక వుండబట్టలేక "అమ్మా. నాన్నగారి దగ్గర మనీ తీసుకొని వుంచు. లాస్ట్‌మినిట్‌లో ఎందుకులే అంటాడు. ఒప్పుకోకు! నాకు ఫస్ట్ పీరియడ్ లేదు. త్వరగా వచ్చేస్తాను" అని లోపల వున్న తల్లికి బిగ్గరగా చెబుతూ కాలేజికి పరుగెత్తింది.

గోవింద్ మాత్రం కాలేజి పోయినా పరవాలేదన్నట్టుగా తాపీగా కూర్చున్నాడు. కమలకి కూడ ఆశ్చర్యంగా వుంది. "పిల్లలు కాలేజికి వెళతారని తెలుసుకదా. ఎందుకు ఆలస్యం చేశారబ్బా!" అనుకుంటూ తనూ బయటి గుమ్మం దగ్గరికి వచ్చి ఎదురు చూస్తూ నిల్చుంది.

ఓ పది నిమిషాలు ఎదురుచూసి లోపలికి వెనుదిరిగేటంతలో ఇంటి ముందు జీప్ ఆగిన శబ్దమై వీధిలోకి చూసింది. జీప్‌నిండా జనం వున్నారు. భర్తని కూడ గుర్తించింది. ఆలస్యమైందని ఆఫీసు జీప్‌లో వచ్చాడనుకుంది.

భర్తతోపాటు జీప్ నుంచి అంతా దిగుతుంటే 'వీళ్ళంతా ఎవరు?' అనుకుంది. ఆశ్చర్యంగా. 'ఒక్కడే రాకుండా యింత మందితో వచ్చాడెందుకు?.. ఇదేమిటి! తనతోపాటు అందరినీ లోపలికి తీసుకొస్తు





స్వర్ణతో పొదుపు అది సురక్షితం చేయండి

**కనకధార డిపాజిట్ ప్రణాళిక :-**
సాలుకు 18% చొప్పున నెలసరి చెల్లింపబడుతుంది. జీవితం క్లుప్తకాలం ప్రణాళిక రూపొందించబడి రు. 5000 గుడాంతముందుకి నెల వ్యవధి గలిగి సాలుకు 15½% చొప్పున నెలసరి వడ్డీ చెల్లించబడగలదు.

**సురక్షవర్ధన క్యాష్ సర్టిఫికేట్లు**
కేవలం 48 నెలల వ్యవధిలో మీ డబ్బుకు రెండింతలుగా పెరిగిస్తాయి

**3 సంవత్సరాల వ్యవధి సర్టిఫికేట్లు**
66.5% మొత్తం డబ్బుకు మీకు మరల పొందే నమ్మిక నివ్వగలవు

**నోటీస్ డిపాజిట్**
సాలుకు 12% - సాలుకు 13% - సాలుకు 14%
వడ్డీ 15 రోజుల - 30 రోజుల - 60 రోజుల నోటీస్ డిపాజిట్లు

**రికరింగ్ డిపాజిట్ ప్రణాళిక**
రు. 50/- లేక దాని గుణాంకముందు నెలసరి మీకు మంచి రాబడినివ్వగలవు

స్వర్ణ
ఫైనాన్స్ అండ్ ఇన్‌వెస్ట్‌మెంట్స్
బ్లూమూన్ థియేటర్ కాంప్లెక్స్,
66, ఎమ్. జి. రోడ్డు, బెంగళూరు-560 001
ఫోను : 579620

స్వర్ణవారి ఆకర్షణీయమైన ప్రణాళికలు


అధిక వివరాలకు బ్రాంచి మేనేజరుతో సంప్రదించండి

హైదరాబాద్—పుష్పాంజలి కాంప్లెక్స్, 210, 2వ అంతస్తు, కోఠి, ఉస్మానియా మెడికల్ కాలేజి ఎదుట—500 001. విజయవాడ—26, 28, 2, ఎస్. బి. ఐ. వి. గర్ల్స్ హైస్కూల్ ఎదుట

నాగేశ్వరరావు పంతులు రోడ్డు, గాంధీనగర్ - 520 003 కాకినాడ - డోర్ నెం 28-1-3 టెంపుల్ స్ట్రీట్, సత్యనారాయణ మూర్తి టెంపుల్ ఎదుట, 533 001 ఫోన్ : 5237
నెల్లూరు- నెం. 16,1082, ట్రంక్ రోడ్డు, దశరథ కాంప్లెక్స్-524 001
కర్నూలు- 40.30, ఎ. పార్కు రోడ్డు ఎదుట, గాంధీనగర్-518 001 ఫోన్ : 1427
కర్ణాటక, మ్యారర్లీ, కోయంబత్తూరు, తిరువనంతపురం
శాఖలు:- మద్రాసు, మదురై, ఎర్నాకులం, పాండిచేరి

MASSCOM

2వ ఫ్లోర్, కొల్లూరు బిల్డింగ్స్ సూర్యబాగ్ విశాఖపట్నం - 530 020




న్నాడు. కొంపదీసి వీళ్ళందరికీ భోజనం పెట్టమనడుగదా !" అని ఆమె మరింత ఆశ్చర్య పడుతుండగా శ్రీనివాసరావుతో పాటు వాళ్ళందరూ యింట్లో ప్రవేశించారు.

వచ్చినవాళ్లు వాళ్ళంతట వాళ్ళే కుర్చీలు లాక్కుని కూర్చుంటుంటే ఆమెకింకా అయోమయంగా వుంది.

భర్త పక్కకివెళ్ళి "ఎవరండీ వీళ్ళంతా" అనడిగింది.

అతను పలకలేదు. అతని ముఖంలో జీవకళ లేదు. ఏ భావమూ వ్యక్తము కావటం లేదు. నిరామయమైన చూపులతో ఏదో కొత్తలోకంలోకి వచ్చినట్టుగా చూస్తున్నాడు.

అతని వాలకం ఆమెకి కంగారు పుట్టించింది.

ఆ ఆగంతకులలో గంభీరంగా కనిపిస్తున్న వ్యక్తి శ్రీనివాసరావుని పాంటు విప్పమని చెప్పి, మరొకటి తెచ్చివ్వమని ఆమెకి చెప్పాడు.

దాంతో ఆమెకి ఆందోళన అధికమై ఆ ఉద్రిక్తతని భరించలేక భర్తని గట్టిగానే అడిగింది. "ఎవరండీ వీళ్ళు ! ఏమిటిదంతా ?" అని.

శ్రీనివాసరావుకి బదులు ఆ వ్యక్తే సమాధానం చెప్పాడు.

"చూడమ్మా నువ్వేమీ కంగారు పడకు ! మేము యాంటీ కరప్షన్ బ్యూరో— అంటే అవినీతి నిరోధకశాఖ అధికార్లం. మీవారు ఆఫీసులో లంచం తీసుకుంటుంటే పట్టుకున్నాం. ఇల్లు సోదాచెయ్యటానికి వచ్చాం. అతనికి పాంటు తెచ్చివ్వు" అని యింటిని పరిశీలనగా చూడసాగాడు.

ఆ మాటలు వినగానే ఆమె గుండెల్లో పిడుగులు పడ్డాయి. కాళ్ళలో వణుకు ప్రారంభమైంది. శరీరమంతా చెమటలు కమ్మాయి.

గుండె దడదడ లాడుతుంటే తడబడే నడకతో మరో పాంటు తెచ్చి భర్తకిచ్చింది

అతను విప్పిన పాంటును వాళ్ళు స్వాధీనం చేసుకున్నారు.

దుఃఖం ఉబికి వస్తుంటే వణికే గొంతుతో "ఒరేయ్ గోవింద్! మీ నాన్నగారి దగ్గరికి రా!" అని ఆర్తితో పిలిచింది. బయటే నిల్చునివున్న గోవింద్‌ని— తమకి ఆసరా అన్నట్టు.

కాని ఆ అధికారి మాటలు విన్న మరుక్షణంనుంచే ముచ్చెమటలలో మునిగి తేలుతున్న గోవింద్— అర్థంకాని భయంతో ధైర్యం చేసి లోపలికి రాలేకపోయాడు.

"ఆ బీరువా తెరవండి" ఆదేశించాడా అధికారి.

గజగజ వణికిపోతూంది కమల. ఏడుపు నాపుకోలేక పోతూంది. ఏంచేయాలో తోచక మిన్నకుండిపోయింది.

"మీరు ఆలస్యం చేస్తే లాభం లేదు. త్వరగా తెరవండి !" "హూంకరించాడా అధికారి.

తత్తరపాటుతో వెళ్ళి తాళాలు తీసుకొని బీరువా తెరిచింది.

అధికారి బీరువా వెతుకుతుంటే గుండెలు కంపించాయి భార్యాభర్త లిద్దరికీ.

అన్ని అరలూ వెతికి కొన్ని బ్యాంక్ పాస్ బుక్కులు, నగలు పైకితీసి వాటివంక విజయగర్వంగా చూశాడు అధికారి.

అవి చూస్తూనే గొల్లుమంది కమల.

నగలను చూస్తూ వ్యాఖ్యగా అన్నాడు అధికారి. "ఎందుకమ్మా యిప్పుడేడవటం? అవినీతి సంపాదనకి ఆశపడకుండానే వుండ వలసింది!"

పాస్‌బుక్‌లపేజీలు తిప్పిచూస్తూ అడిగాడు శ్రీనివాసరావుని "ఏమయ్యా శ్రీనివాస్‌రావ్? ఆఫీసులో ఏదో బుకాయించావ్! యీ కొద్ది సంవత్సరాల్లోనే యిన్ని వేలకి ఫిక్సెడ్‌డిపాజిట్లు!.... యిన్ని నగలు కూడ చేయించావా — అచ్చంగా నీ జీతంలోంచే ?"

అప్పటివరకు చైతన్య రహితంగా నిలబడిన శ్రీనివాసరావు కన్నీళ్ళు కారుస్తూ ప్రాధేయపడ్డాడు.

"సార్ ! భూమిమీద వచ్చే ఆదాయం. ఎంతో కష్టపడి జీతంలో మిగుల్చుకున్నది కలిపి పిల్లలకోసం దాచానుసార్ ! ఆ నగలు దాని పుట్టింటివాళ్ళు చేయించినవి.... నా ఉద్యోగం వుంటుందో— వూడుతుందో! పిల్లలకి అన్నంపెట్టిన వాళ్ళవుతారు ! వీటినన్నా వదిలెయ్యండి సార్ !" అంటూ అధికారి కాళ్ళమీద పడ్డాడు.

"ఛఛ ! యిదేం పనయ్యా ? దేనికైనా ధైర్యంగా వుండాలి. లేలే !" అంటూ అధికారి అతడిని పైకి లేవదీశాడు.

ఏదో తెలివి వచ్చినట్టుగా వెంటనే అందుకుంది కమల.

"అవునండీ! పిల్లలకు, నాకు అప్పుడప్పుడు మా పుట్టింటివాళ్ళు పెట్టిన నగలండీ యివన్నీ!"

"అలాగేనమ్మా ! మీ పుట్టింటి వాళ్ళెంత భాగ్యవంతులో, మీకెన్ని భూములున్నాయో అన్నీ విచారించి మీ వస్తువులు మీకే అప్పగిస్తాం. చెప్పానుగదా కంగారేమీ లేదని. మీరు కాస్సేపు గమ్మునుంటే మా పని పూర్తిచేసుకుంటాం" అని వాటినన్నిటినీ మరో అధికారికి అందించాడు.

అధికారులు రిపోర్టు వ్రాసుకుంటున్నంతసేపూ శ్రీనివాసరావు ప్రాధేయపడుతూనే వున్నాడు వాటిని వదిలేయమని. అప్పటికే చుట్టుపక్కలవాళ్ళు చాటుమాటుగా చూస్తున్నారు ఈ తతంగమంతా. అటు పరువూ పోయి, యిటు కూడబెట్టిన డబ్బు, నగలు పోతున్నాయని వివశురాలై తల గోడకేసి కొట్టుకుంటూ ఏడుస్తోంది కమల.

గోవింద్ కూడ కారేకన్నీళ్ళని తుడుచుకుంటూ లోపలికొచ్చి తల్లిని వారిస్తు పట్టుకున్నాడు బిక్కమొహంతో.

"ఏమమ్మా? ఇలా అల్లరిచేస్తూ మా పనికి ఆటంకం కలిగించకూడదు.వూరుకో" అని మందలించాడు అధికారి.

మరి కొద్ది నిమిషాల్లో రిపోర్టు పూర్తిచేసి శ్రీనివాసరావుని స్వంత పూచీకత్తు మీద వదిలి, వచ్చిన వాళ్ళంతా జీపులో వెళ్ళిపోయారు.

బావురుమంటూ భర్తని చుట్టేసింది కమల.

అప్రతిభుడై వెళ్ళిన వాళ్ళవంకే కళ్ళప్పగించి చూస్తుండిపోయాడు శ్రీనివాసరావు. బోనులోపడ్డ ఎలుకలా వుందతని స్థితి !